క్లుప్తంగా

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షలో పాఠశాలకు 600మంది విద్యార్థులను కేటాయించగా, 563 మంది హాజరైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ప్రాంతీయ సమన్వయ అధికారిని ఫ్లోరెన్స్‌రాణి తనిఖీ చేశారు. డిపార్ట్‌మెంటల్ అధికారి అనురాధ, సిట్టింగ్ స్క్వాడ్ అఖిల్‌లు పరీక్ష ప్రారంభం నుంచి ముగిసే వరకు పర్యవేక్షించారు.

అక్క కాపురానికి రాలేదని చెల్లిపై దాడి

ధరూరు: అక్క కాపురానికి రావడం లేదని, చెల్లిని కొట్టిన ఘటన మండలంలోని కోతుగిద్దలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కోతులగిద్దకు చెందిన ఈడిగ మల్లేష్‌గౌడ్ నందిన్నె గ్రామానికి చెందిన తన మేన కోడలు కూతురు భారతిని కొడుకుకు వివాహం చేశారు. కొన్ని రోజులుగా భారతి కాపురానికి రావడంలేదు. తన తమ్ముని కొడుకుకు భారతి చెల్లి శివరాణిని పెళ్లి చేశారు. ఈ క్రమంలో తన కోడలు కాపురానికి రాకపోవడానికి శివరాణి కారణమని ఈడిగ మల్లేష్‌గౌడ్, అతని భార్య సుజాత కలిసి ఆమెను కొట్టారు. దీంతో శివరాణి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఎస్ఐని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల నూతన ఎస్ఐ వెంకటేష్‌ను ఆదివారం అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి కలిసి శాలువా, పూలబొకేతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నర్సింహులు, రవి, రాముడు, ఉస్సేన్ ఉన్నారు.

విచారణ పేరుతో కాలయాపన తగదు

రాజోళి: ప్రజలకు సక్రమంగా సేవలు అందించని మీ సేవ కేంద్రంపై 'సాక్షి' లో వచ్చిన కథనాలపై ఆయా గ్రామాల ప్రజలు 'సాక్షి'కి ఫోన్ చేస్తున్నారు. మాన్‌దొడ్డిలో ఉన్న సదరు మీసేవ కేంద్రంపై మాన్‌దొడ్డి, పచ్చర్ల, పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ గ్రామాల ప్రజలు సాక్షితో మాట్లాడుతున్నారు. మీ సేవ మాకు సేవలు అందించడం లేదని గతంలో ఎందరో అధికారులకు,నాయకులకు తెలిపిన పట్టించుకోలేదని సాక్షిలో కథనాలు వచ్చిన తర్వాత అధికారులు గ్రామంలో విచారణ చేపట్టారని, కాని ఈ విచారణ నామమాత్రంగా వదిలేస్తే ఆధారాలతో సహ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మీ సేవ నిర్వాహకుడు మీ సేవ కేంద్రాన్ని వదిలి, వైన్ షాపులో పని చేస్తున్నాడన్న వాస్తవాన్ని అధికారులు గమనించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని, విచారణ పేరుతో కాలయాపన చేయకూడదని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇసుకకు అనుమతులివ్వాలి

రాజోళి: మండలంలోని ప్రభుత్వం ద్వారా అనుమతి పొందిన పనులకు ఇసుక అనుమతి ఇవ్వాలని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు కోరుతున్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పనులకు మాత్రం సంబంధిత అనుమతి పత్రాలను చూసి పర్మీషన్ ఇవ్వాలని కోరుతున్నారు. అక్రమంగా రవాణా చేసేవారిని దృష్టిలో పెట్టుకుని ఇసుకపై నిబంధనలు పెట్టడం సమంజసమే అయినప్పటికీ, ఇప్పటికే గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు మంజూరు అయ్యాయని, ఆ పనుల్లో జాప్యం జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటిని దృష్టిలో పెట్టుకుని అనుమతి పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అనుమతించాలని కోరుతున్నారు.

వృథాగా ట్రీ గార్డ్స్

ఉండవెల్లి: మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో హరితహారంలోని ట్రీ గార్డులను ఉపయోగించకుండా అక్కడే ఉంచడంతో అవి దెబ్బతింటున్నాయి. లక్షలు వేచించి ట్రీ గార్డులను తీసుకొచ్చి మూలకు పాడేశారని, వాటిని ఉపయోగించి మొక్కలకు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్వేస్టేషన్‌లో సమస్యలు

- ప్రయాణికులకు అడ్డుగా దిమ్మెలు
- వాహనాల పార్కింగ్ లేక చెట్టుకు గొలుసులతో తాళం
- శిథిలమైన బస్టాప్
- 10 నిమిషాలలో టికెట్ కౌంటర్ ఓపెన్



గొలుసుతో వాహనాలను భద్రపరిచిన దృశ్యం



జోగుళాంబ రైల్వేహాల్ట్‌లో తగ్గులో ఉన్న ప్లాట్‌ఫాం



ప్రయాణికులు వెళ్లే దారిలో అడ్డుగా ఉన్న దిమ్మెలు

ఉండవెల్లి: జోగుళాంబ రైల్వే హాల్ట్‌కు ప్రయాణికులు వచ్చే దారిలో అడ్డుగా దిమ్మెలున్నాయి. జోగుళాంబ రైల్వేహాల్ట్‌లో రైలు ఎక్కేందుకు హై లెవల్ ఫ్లాట్ ఫాం కోసం దిమ్మెలను తయారు చేసి అక్కడే నిల్వ చేశారు. రైలు ఎక్కేందుకు వెళ్లే దారిలో దిమ్మెలు అడ్డుగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. వాటిని త్వరగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బస్టాప్ ఉన్నా లేనట్టే..

అలంపూర్ నియోజకవర్గంలోని అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు, రాజోళి, వడ్డేపల్లి మండలాలకు చెందిన గ్రామాల ప్రజలు రైలు ప్రయాణానికి జోగుళాంబ హాల్ట్‌కు వెళ్లి వస్తున్న సమయంలో అక్కడ వేచి ఉండడానికి బస్టాప్ ఉన్నా మొత్తం శిథిలావస్థకు చేరింది. ఎక్కడ ఉండాలో తెలియక రోడ్డు మీద ప్రయాణికులు నిలుస్తున్నారు.

వాహనాల భద్రతకు గొలుసు తాళం

రైల్వే స్టేషన్ సమీపంలోని పార్కింగ్ లేక రోడ్డు పక్కనే వాహనాలు నిలుపుతున్నారు. కొద్ది రోజులుగా అక్కడ ఒక బోర్డు ఏర్పాటు చేసి చెట్టు కింద కంచె ఉంచి వాహనాలకు ధరలను కేటాయించారు. కొన్ని వాహనాలు దొంగిలించడంతో టెండర్ ప్రక్రియను రైల్వే అధికారులు నిలిపేశారు.

జోగుళాంబ రైల్వే హాల్ట్‌కు అలంపూర్ పుణ్యక్షేత్రానికి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అక్కడ మూత్రశాలలు అందుబాటులో లేవు. అక్కడి నుంచి వచ్చే భక్తులకు అలంపూర్ ఆలయానికి వెళ్లడానికి సమయానికి వాహనాలు ఉండవు. రైల్లో వచ్చే భక్తులకు ఆలయానికి వెళ్లేందుకు వాహనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యలపై స్పందించాలి



ప్రయాణికులు రైలు కోసం వేచి ఉండేందుకు షెల్టర్ లేదు. టికెట్ కౌంటర్ అందుబాటులో పెట్టడం లేదు. రైలొచ్చే పది నిమిషాల ముందు టికెట్లు ఇవ్వడంతో హడావుడిగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలకు కనీస సౌకర్యాలు లేవు. వృద్ధులకు హై లెవల్ ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేయాలి. అధికారులకు ఎన్నోసార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదు.

– చిన్నబాబు, ఉండవెల్లి

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో మల్దకల్ మండలం దాసరిపల్లికి చెందిన దుబ్బన్నకు మెరుగైన వైద్యం కోసం ఆయన కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.1.50లక్షల ఎల్ఓసీ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వీరన్న, వెంకటన్న, భరత్‌రెడ్డి, రాముడు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.2లక్షల విరాళం



మానవపాడు: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి, శివాలయాల అభివృద్ధికి డాక్టర్ సాయినాథరెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం రూ.2లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల దగ్గర ఏర్పాటు చేసిన ముఖద్వారాల పూజలో వారు పాల్గొన్నారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి రూ. 2లక్షల నగదును ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, నాయకులు దామోదర్‌రెడ్డి, హరినాథరెడ్డి, రఘురెడ్డి, పరమేశ్వరనాయుడు, శివరాంరెడ్డి, బాషా ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగుల వితరణ

గద్వాల: బీజేపీ పట్టణ అధ్యక్షుడు, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండల వెంకట్రాములు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం బాలసదనం విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరి వితరణ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రోగుల సహాయకులకు అన్నదానం చేశారు.



బ్యాగులను వితరణ చేస్తున్న వెంకట్రాములు

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చండి



సమావేశంలో వడ్డెర సంఘం నాయకులు

అయిజ: వడ్డెరలను ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం నాయకుడు పాండు రంగ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో వడ్డెర సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వడ్డెర సంఘం నాయకులు మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో వడ్డెర కులాన్ని బీసీ నుంచి తొలగించి ఎస్టీ జాబితాలో చేర్చి, కేంద్ర ప్రభుత్వానికి తీర్మానం పంపాలని కోరారు. చదువుకునే వడ్డెర విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాండురంగ, వీరేష్, మల్లయ్య, బుడ్డారెడ్డి, లక్ష్మన్న, మర్రి స్వామి, హనుమంతు, బాలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆత్మార్పణ పూజలు



అయిజ: ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ఆత్మార్పణం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకం నిర్వహించి మంగళ హారతులతో నీరాజనం పలికారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మల్దకల్ ఎస్ఐగా సురేష్‌గౌడ్




మల్దకల్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా సురేష్‌గౌడ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించా రు. ఇక్కడ పని చేస్తున్న కల్యాణ్‌కుమార్ బదిలీపై వనపర్తి జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో సురేష్ గౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది బదిలీపై వెళ్తున్న ఎస్ఐకి వీడ్కోలు పలుకుతూ, కొత్తగా వచ్చిన ఎస్ఐకి ఘనంగా స్వాగతం పలికారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. అంతకు ముందు నూతన ఎస్ఐ ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు.

బాధితులకు ఆర్థిక సాయం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీవీ పల్లికి చెందిన బోయ మధు అనారోగ్యంతో అకాల మరణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, ఎల్కూరు శ్రీనివాసులు ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు.

పల్లెల పరిశుభ్రతే లక్ష్యం

- అన్ని గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్
- 15వ తేదీ వరకు పారిశుద్ధ్య కార్యక్రమాలు
- వీధులను శుభ్రం చేసిన పంచాయతీ సిబ్బంది



నందిన్నెలో చెత్తను తరలిస్తున్న కార్మికులు



చెత్తను తొలగిస్తున్న కార్మికులు

కేటీదొడ్డి: గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం బావించింది. దీనిలో భాగంగా ప్రతి పల్లెను పరిశుభ్రంగా మార్చాలనే లక్ష్యంతో బుధవారం నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల (స్పెషల్ శానిటేషన్ డ్రైవ్)కు శ్రీకారం చుట్టింది. కార్యక్రమాలు ఈ నెల 15 వరకు నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో ఈనెల 2వ తేదీ నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు పారిశుద్ధ్య పనులు మొదలయ్యాయి. కార్యక్రమంలో యువత, మహిళలు స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల నేతృత్వంలో పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి.

సమస్యలు గుర్తించి పరిష్కరించేలా..

మండలంలోని 23 గ్రామ పంచాయతీలున్నాయి. ఆయా గ్రామాల్లో వారం రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టనున్నారు. మొదటి రోజు ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తించారు. రోజువారీగా కార్యచరణ రూపొందించి వారం రోజుల్లోనే వాటిని పరిష్కరించనున్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు ప్రజలందరికీ సురక్షితమైన తాగునీటి సరఫరా చేయాలని, రాబోయే వేసవిలో నీటి ఎద్దటి లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. చివరిరోజు పండుగ వాతావరణంలో ముగింపు కార్యక్రమాలు నిర్వహించాలని, పనితీరు ఆధారంగా మండలాల వారీగా ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపిక చేసి ప్రశంసా పత్రాలను అందించనున్నారు.

చేపట్టే పారిశుద్ధ్య కార్యక్రమాలు

గ్రామాల్లో రోజు రోడ్లు శుభ్రం చేసి డ్రెయినేజీల్లో పూడిక తీయాలి. కాల్వల్లో మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి. వీధుల్లో రోడ్లపై గుంతలను పూడ్చాలి. పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్, బస్‌షెల్టర్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు శుభ్రం చేయాలి. ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో నీటిని తొలగించాలి. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు కూల్చి వేయాలి. నిరుపయోగంగా ఉన్న బావులు, బోర్లను పూడ్చి వేయాలి. మురికి కాల్వలో, నీళ్లు నిల్వ ఉండే ప్రాంతల్లో దోమలు నియంత్రణకు ఆయిల్‌బాల్స్ వేయాలి. శుక్రవారం డ్రై డేగా పాటించి ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయాలి.

పకడ్బందీగా నిర్వహించాలి

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను అధికారులు, స్థానిక యువత, మహిళల భాగస్వామ్యంతో కలిసి పకడ్బందీగా నిర్వహించాలి. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్‌లో సూచించిన ప్రకారం రోజువారీగా పనులు చేపట్టాలి.

– సయ్యద్‌ఖాన్, ఎంపీఓ, కేటీదొడ్డి

13 నుంచి జములేశ్వరి మాత ఉత్సవాలు

అమరచింత: పట్టణ శివారులో వెలసిన జములేశ్వరి మాత ఉత్సవాలు ఈనెల 13 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు నరసింహులు తెలిపారు. 12న జమ్ములేశ్వరి దేవికి పట్టుచీర ఆభరణాలను పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయం నుంచి భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి అలంకరిస్తామని పేర్కొన్నారు. నెల రోజుల పాటు ప్రతి మంగళ, శుక్రవారాల్లో అమ్మవారి ఆలయం వద్ద భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలను కల్పించామన్నారు.

పెబ్బేరులో చౌడేశ్వరీ జాతర

పెబ్బేరు రూరల్: పట్టణంలో జరుగుతున్న చౌడేశ్వరి జాతరలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున అమ్మవారి జ్యోతుల ఊరేగింపు, పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని భారీ ఊరేగింపుతో తీసుకొచ్చి చిన్న చౌడేశ్వరీ ఆల యంలో భక్తుల దర్శనం కోసం ఉంచారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించారు. జాతర సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులతో కలిసి పూజలు చేశారు.

ఘంటసాల గాత్రం పదిలం

వనపర్తి టౌన్: తరాలు మారుతున్నా చరిత్రలో ఘంటసాల గాత్రం పదిలంగా ఉంటుందని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. ఆదివారం ఘంటసాల 50వ వర్ధంతిని పురస్కరించుకొని కళాకారులు సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘంటసాల గాత్రం నేటికి ప్రజల మనస్సును తట్టిలేపే శక్తి ఉందని, అలాంటి గాత్రంతో ప్రజలను మంత్ర ముగ్ధులు చేసిన మహానీయుడు ఘంటసాల అని కొనియాడారు. దైవ, దేశ భక్తి, ప్రేమ, విరహ ఉత్సాహ పబోధాత్మకమైన పాటలు, రాగం, భావ, మనసుకు హత్తుకునేలా ఉండేవన్నారు. కార్యక్రమంలో నాయకులు శరవంద, భాస్కర్, రాములు ఉన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ధన్వంతరి వేంకటేశ్వర స్వామి ఆలయం

అయిజ: మండలంలోని ఉత్తనూరులో సోమవారం నుంచి ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సద్ధం చేశారు. ఉత్సవాల సందర్భంగా ఈనెల 12న సంగీత విభాగం నృత్య ప్రదర్శన నిర్వహించనున్నారు. 13న భజన పోటీలు, 14 నుంచి 17 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 18వ తేదీన ఇసుక సంచి ఎత్తుపోటీలు, సందరాళ్ల ఎత్తు పోటీలు, దొబ్బుడు గుండ్లు ఎత్తు పోటీలు, గుబ్బల గుండ్లు ఎత్తు పోటీలు నిర్వహించనున్నారు.

ఈనెల 15 నుంచి 17 వరకు రైతు సంబరాలు..

రైతు సంబరాల్లో భాగంగా ఈనెల 15న నాలుగు పళ్ల విభాగం వృషభరాజుల బల ప్రదర్శన నిర్వహించనున్నారు. ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.10 వేలు ప్రకటించారు. 16న ఆరు పళ్ల విభాగం వృషభరాజుల బల ప్రదర్శన. ప్రథమ బహుమతి రూ. 40 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.10 వేలు ప్రకటించారు. ఈనెల 17న న్యూ కేటగిరి విభాగం వృషభరాజుల బల ప్రదర్శన. ప్రథమ బహుమతి రూ. 50 వేలు, ద్వితీయ బహుమతి రూ. 40 వేలు, తృతీయ భహుమతి రూ. 30 వేలు, నాల్గవ బహుమతి రూ. 20 వేలు ప్రకటించారు.

అంతర్రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు

మండలంలోని ఉత్తనూరులో ఈనెల 15 నుంచి 18 తేదీ వరకుతెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్వహించనున్నారు. మహిళల విభాగంలో జట్టుకు ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బ హుమతి రూ.15 వేలు, నాల్గవ బహుమతి రూ.10 వేలు నగదు బహుమతి ప్రకటించారు. పురుషుల విభాగంలో ప్రథమ బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.25 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గో బహుమతి రూ.15 వేలు ప్రకటించారు.

నేటి నుంచి అంజన్న జాతర

- 14 పెద్ద చింతరేవులలో రథోత్సవం



ముస్తాబైన అంజనేయ స్వామి ఆలయం



మూల విరాట్

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. సోమవారం నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించారు. అంజన్న బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

సోమవారం 12న అంకుర్పణ, ధ్వజారోహణం, 13న ఉపనయనం, తెప్పోత్సవం, పల్లకీసేవ, ప్రభోత్సవం, 14న రాత్రి 10 గంటలకు రథోత్సవం, 15న ప్రభోత్సవం, 16న అవభృత స్నానం, 17న భీష్మాష్టమి, 18న మధ్వ నవమి, 19న మాఘ శుద్ధ దశమి పల్లకీ సేవ స్వస్తీ వచనంతో బ్రహ్మోత్సవాలు ముగు స్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అన్నదాన సత్రానికి విరాళం



సత్రానికి చెక్కు అందజేస్తున్న భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పుణ్యక్షేత్రంలోని బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రానికి ఆదివారం భక్తులు హితోదికంగా రూ.22 వేలు విరాళం అందజేశారు. దేవస్థానం పాలకమండలి చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఆలయ ధర్మకర్తల వెంకటేశ్వర్‌రెడ్డికి చెక్కు రూపంలో విరాళం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన జయలక్ష్మి, లక్ష్మి చీరాల అనే భక్తులు ఈ విరాళం అందజేశారు. ఆలయంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన సత్రంలో మంచి ఏర్పాట్లు ఉన్నాయని, భోజనాలు రుచిగా, సుచిగా ఉన్నాయంటూ కితాబిచ్చారు. అనంతరం దేవస్థానం వారు వారికి అమ్మవారి ప్రసాదాలు అందజేసి అభినందనలు తెలిపారు.

అభివృద్ధికి నోచుకోని చెన్నిపాడు

- ఆరు దిక్కుల్లో రహదారులు
- రోడ్డు నిర్మాణాలు శూన్యం



చెన్నిపాడు వ్యూ

మానవపాడు: తరాలు మారినా, చరిత్ర పుటలు మారుతున్న చెన్నిపాడు గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా రహదారి నిర్మాణం, నీటి వసతి ఉండాలి. ఈ గ్రామానికి ఆరు దిక్కుల రహదారులున్నాయి. సరైన రోడ్డు నిర్మాణం లేకపోవడం, ఎన్నో ఏళ్లుగా బ్రిడ్జి నిర్మాణాలు లేకపోవడం, పూరాతన గ్రంథాలయం ఉన్నా యువకులకు, విద్యార్థులకు నిరుపయోగంగా ఉండటం వంటివి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. 1960లో ముఖ్యమంత్రులు, కవులు, కళాకారులు, గ్రంథాలయాలకు నిలయం ఈ గ్రామం ఉండేది. ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. చెప్పుకోవడానికి మాత్రమే చరిత్ర తప్ప అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడలేదు. గ్రామం చుట్టూ ఆరు దిక్కులా రహదారి ఉన్నా రోడ్డు నిర్మాణాలు నేటికీ నిర్మించకపోవడమే పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శంగా చెప్పవచ్చు. ప్రధానంగా వ్యవసాయ అధారితమైన చెన్నిపాడు నుంచి ఇటిక్యాల అంతర్జాతీయ రహదారి-44 వెళ్లే దారి ఉంది. ప్రధాన రహదారి ఇరువైపుల నల్లరేగడి నేలలు ఉండడం వ్యవసాయ దిగుబడికి బాగా కలిసొస్తుంది. చెన్నిపాడు నుంచి జల్లాపురం గ్రామానికి అంతర్జాతీయ రహదారికి రోడ్డు మార్గం ఉంది. వ్యవసాయ పనులకు ఆర్డీఎస్ కాల్వ-30పై దారి ఉంది. రైతులు ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తారు. చెన్నిపాడు నుంచి చంద్రశేఖర్‌నగర్ గ్రామానికి అంతర్రాష్ట్ర రహదారికి ప్రధాన రోడ్డు మార్గం ఆర్డీఎస్ కాల్వ-29పై ఉంది. ఈ దారి సరిగా లేదు. రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉంది. చెన్నిపాడు నుంచి వయా పుసలపాడు శివారు గుండా బొంకూరుకు అంతర్రాష్ట్ర రహదారికి సరైన రోడ్డు మార్గం ఉన్నా, బ్రిడ్జి నిర్మాణం లేదు. మానవపాడు మండల కేంద్రానికి రోడ్డు గుంతలమయంగా ఉంది. చెన్నిపాడు నుంచి అలంపూర్ చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారి సైతం గుంతలమయంగా ఉంది. వర్షం పడితే వ్యవసాయ పనులకు వెళ్లేలంటే బురదమయంగా మారుతుంది. పాలకులు, ఉన్నతాధికారులు ఎన్నోసార్లు గ్రామాన్ని సందర్శించినా సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా చెన్నిపాడు గ్రామ సమస్యలు పరిష్కరించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



చెన్నిపాడు గ్రామం నుంచి బ్రిడ్జి నిర్మాణం లేని అంతర్రాష్ట్ర రహదారి